ఎవరూ వద్దు..

# 'నోటా' ముద్దు! 04

అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఓటర్లు
మహబూబాబాద్ మున్సిపల్ పోరులో నోటాకు భారీగా ఓట్లు
గెలుపోటములను శాసించిన 'పైవారెవరూ కాదు' ఆప్షన్
ప్రధాన పార్టీల అభ్యర్థులపై ఓటర్ల నిశ్శబ్ద విప్లవం




హంగ్ మున్సిపాలిటీలపై

# కాంగ్రెస్ నజర్

- వ్యూహాత్మక అడుగులు.. ఆకర్ష్ మంత్రం 05
- కింగ్ మేకర్లుగా మారిన స్వతంత్రులు
- చైర్మన్ పీఠాలపై ఉత్కంఠ

సంపుటి :02 | సంచిక :307 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శనివారం 14, ఫిబ్రవరి 2026

డీఎస్పీల బదిలీలకు

# రంగం సిద్ధం..?

ఎమ్మెల్యేల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు 03

- రిటైర్మెంట్ కు దగ్గరవుతున్నా 'లూప్ లైన్' లోనే కొందరు సీనియర్లు
- లా అండ్ ఆర్డర్ పోస్టింగ్ కు డిమాండ్

రాష్ట్ర పోలీస్ శాఖలో డీఎస్పీల బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేయడంతో, కీలకమైన లా అండ్ ఆర్డర్ పోస్టింగ్ల కోసం ఆశావాహులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి లూప్ లైన్‌లో ఉండి రిటైర్మెంట్‌కు దగ్గరవుతున్న సీనియర్లకు ప్రాధాన్యత దక్కకపోవడంతో, మున్సిపల్ ఎన్నికల తర్వాత భారీస్థాయిలో బదిలీలు ఉండవచ్చని పోలీస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. – అక్షర దర్బార్, మొగుళ్లపల్లి




# రెడ్డి బ్రదర్స్ అరాచకం

సింగరేణి సంస్థలో నిబంధనలు ఖూనీ



- నిర్వాసితుల పొట్టకొట్టి ఉద్యోగాల అమ్మకం
- ప్రకటన లేదు.. పారదర్శకత లేదు
- చీకట్లో రన్నింగ్ పోటీల డ్రామా.. ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల బేరం?
- అధికారుల అండతోనే ఏజెన్సీ బరితెగింపు 02
- విజిలెన్స్ విచారణకు డిమాండ్

**అక్షరదర్బార్, హనుమకొండ:**

నమ్మిన నిబంధనలు ఖూనీ.. అర్హులకు అన్యాయం.. తెరవెనుక లక్షల రూపాయల బేరసారాలు! సింగరేణి సంస్థలో ఒక ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ బరితెగింపు పరాకాష్టకు చేరింది. 'రెడ్డి బ్రదర్స్ సెక్యూరిటీ సర్వీసెస్' అనే సంస్థ నిబంధనలను తుంగలో తొక్కి, ఉద్యోగాలను బహిరంగంగా అమ్ముకుంటున్నట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీస ప్రకటన లేకుండా, చీకటి ఒప్పందాలతో రన్నింగ్ పోటీల డ్రామా ఆడి, ఒక్కో పోస్టుకు రూ. 3 లక్షల వరకు వసూలు చేస్తోందని సమాచారం. భూములు కోల్పోయి న్యాయమైన ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితులను నట్టేట ముంచుతూ, అధికారుల అండతో ఈ ఏజెన్సీ సాగిస్తున్న అరాచకంపై ఇప్పుడు సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

సైబర్ 'వల'లో

# ఢిల్లీ బాధితులు

- నర్సంపేట మహిళ ఘనకార్యం
- నిరుద్యోగులు, అమాయకులే లక్ష్యంగా భారీ స్కామ్
- ఢిల్లీ పోలీసుల అదుపులో నిందితురాలు 05

# 'శివోహం'

- శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు
- వేయిస్తంభాల గుడిలో ఉత్సవాల సందడి
- విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న రామప్ప, కాళేశ్వరం
- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు 03






# 'రెడ్డి బ్రదర్స్' అరాచకం

- సింగరేణి సంస్థలో నిబంధనలు ఖూనీ
- నిర్వాసితుల పొట్టకొట్టి ఉద్యోగాల అమ్మకం
- ప్రకటన లేదు.. పారదర్శకత లేదు
- చీకట్లో రన్నింగ్ పోటీల డ్రామా.. ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల బేరం?
- అధికారుల అండతోనే ఏజెన్సీ బరితెగింపు
- విజిలెన్స్ విచారణకు డిమాండ్

**అక్షరదర్బార్, హనుమకొండ:** సింగరేణి సంస్థలో ఒక ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. రెడ్డి బ్రదర్స్ సెక్యూరిటీ సర్వీసెస్ అనే సంస్థ నిబంధనలను తుంగలో తొక్కి, భూ నిర్వాసితుల జీవితాలతో చెలగాటమాడుతోంది. "ప్రశ్నించే వాడు లేడు.. అడ్డు చెప్పే అధికారి లేడు" అన్న ధీమాతో ఈ ఏజెన్సీ బరితెగించి వ్యవహరిస్తోంది. తాజాగా జరిగిన రన్నింగ్ పోటీలే ఇందుకు నిదర్శనం.

## - చీకటి ఒప్పందాలు

సింగరేణి నిబంధనల ప్రకారం భర్తీకి ముందు పేపర్ ప్రకటన ఇవ్వాలనే కనీస ధర్మాన్ని కూడా ఈ సంస్థ విస్మరించింది. ఎవరికీ తెలియకుండా, అత్యంత రహస్యంగా ఈనెల 3న రన్నింగ్ నిర్వహించి తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకున్నారు. రన్నింగ్‌లో పాల్గొన్న 27 మందిలో ఒక్కరంటే ఒక్కరు కూడా స్థానిక భూ నిర్వాసితులు లేకపోవడం ఈ కుంభకోణానికి నిదర్శనం. టెండర్ ఆర్డర్ వచ్చిన 15 రోజుల నుంచి నెల రోజుల్లోపు రన్నింగ్ నిర్వహించాల్సి ఉండగా, 9 నెలల పాటు ఆపి.. తెరవెనుక బేరసారాలు ముగిశాకే ఈ తూతూ మంత్రపు రన్నింగ్ నిర్వహించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## - నిర్వాసితుల ఆగ్రహం

భూములు కోల్పోయి, సర్వం త్యాగం చేసిన తమకు ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కేటీకే ఓసి-3 నిర్వాసితులు మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. "పాత టెండర్ అయిపోయాక తీసుకుంటామని మాయమాటలు చెప్పారు.. తీరా కొత్త టెండర్ వచ్చాక మా పొట్ట కొట్టి బయటి వ్యక్తులకు ఉద్యోగాలు అమ్ముకున్నారు. మా భూములు తీసుకుని మమ్మల్ని రోడ్డున పడేస్తారా?" అంటూ బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

## - విజిలెన్స్ విచారణకు డిమాండ్

ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని, రన్నింగ్‌లో పాల్గొన్న ఆ 27 మంది ఎవరో, వారికి ఏజెన్సీతో ఉన్న సంబంధాలేంటో బయటపెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. న్యాయం జరగని పక్షంలో ప్రాజెక్టును స్తంభింపజేస్తామని, ఓసి-3 ముట్టడికి వెనుకాడబోమని నిర్వాసితులు హెచ్చరిస్తున్నారు.

## - రూ. 3 లక్షలు ఇస్తేనే ఖాకీ డ్రెస్?

ఈ భర్తీ ప్రక్రియలో ఒక్కొక్కరి దగ్గర రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల వరకు అక్రమంగా వసూలు చేసినట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. గతంలో కొన్ని పత్రికల్లో ఈ అక్రమ వసూళ్లపై వార్తలు వచ్చినా, సింగరేణి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న 'వాటాల' లెక్కలేమిటోనని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులను, యూనియన్ నాయకులను ఏజెన్సీ తనకు అనుకూలంగా మార్చుకుందని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. చివరకు తమ ఏజెన్సీపై వార్తలు రాసిన మీడియా ప్రతినిధులకు కూడా ఉద్యోగాలిచ్చి మేనేజ్ చేసుకున్నట్లు తెలిసింది.



# యాదాద్రీశుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రముఖ పుణ్య క్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని శనివారం ఉదయం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దర్శించుకుని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ప్రజలందరి సుఖసంతోషాలు, నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర శ్రేయస్సు కోసం స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్వామి వారి కృపతో రాష్ట్రంలో శాంతి, అభివృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. దర్శనానంతరం ఎమ్మెల్యేకు ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచన మండపంలో వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందజేశారు.




# "శలాక" ఎల్లో మిరప క్షేత్ర ప్రదర్శన

### ఎకరానికి 25-30 క్వింటాళ్ల దిగుబడి

అక్షరదర్బార్, పరకాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరుకోతపల్లి మండలం నిజాంపల్లనే గ్రామంలో క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతు క్షేత్ర ప్రదర్శన విజయవంతంగా నిర్వహించారు. కంపెనీకి చెందిన "శలాక" ఎల్లో మిరప రకాన్ని ప్రదర్శనలో ఉంచారు. జగ్గాయపేట, తిరుమలగిరి, వెంకటేశ్వరపల్లి, సుల్తాపూర్ తదితర పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరై పంటను పరిశీలించారు. ప్రస్తుత మార్కెట్ ధరలను దృష్టిలో ఉంచుకుని ఈ రకంపై రైతులు విశేష ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా కంపెనీ ఏరియా మేనేజర్ శివకృష్ణ మాట్లాడుతూ సరైన సాగు విధానాలు పాటిస్తే ఎకరానికి సుమారు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో చీడపీడలు, నల్లిని తట్టుకునే సామర్థ్యం ఈ రకానికి ఉన్నందున రైతులకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అరుంధతి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ అధినేత పరమేశ్వరతో పాటు స్థానిక రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రైతుల నుంచి మంచి స్పందన లభించిన ఈ క్షేత్ర ప్రదర్శన విజయవంతంగా ముగిసింది.

# స్టేషనరీ సామాగ్రి అందజేత





అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: స్థానిక ములుగులోని కేజీబీవీ పాఠశాలలో జనని ఫౌండేషన్ ములుగు వారి సమన్వయంతో 20 మంది అనాథ, సెమీ అనాథ బాలికలకు శనివారం స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. పరీక్షలకు అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, జ్యామెట్రీ బాక్సులు, కలర్ పెన్నులు, స్కేల్స్ తదితర వస్తువులను విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా జనని ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. రాజా మాట్లాడుతూ, ములుగు జిల్లాలోని నిరుపేదలకు తమ సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత నెలలో 8వ, 9వ, 10వ తరగతి బాలికలకు హైజీన్ కిట్లు అందజేశామని, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి.సి.డి.పి.ఓ రజిత మేడం హాజరై విద్యార్థినులకు స్టేషనరీ అందజేశారు. అదే రోజు ఫేర్‌వెల్ డే వేడుకలను కూడా ఘనంగా నిర్వహించారు. కేజీబీవీలకు ఉపయోగకరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనని ఫౌండేషన్ ములుగు వారికి పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనని ఫౌండేషన్ సిబ్బంది బిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'అమృత హస్తం' ఆవిష్కరణ

### హెల్త్ కార్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ: పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్యాన్ని చేరువ చేసేందుకు హనుమకొండ కాకాజీ కాలనీలోని అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సరికొత్త పథకాన్ని ప్రారంభించింది. శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాస్పిటల్ ప్రతినిధులతో కలిసి 'అమృత హస్తం' హెల్త్ కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, సామాన్యులకు కార్పొరేట్ వైద్యం భారం కాకూడదనే లక్ష్యంతో ఈ కార్డును రూపొందించడం అభినందనీయమన్నారు. కేవలం రూ.15,000 లకే ఏడాది పాటు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులకు ఉచిత ట్రీట్మెంట్ అందించనున్నారు. 10 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయసు గల వారు ఈ కార్డు పొందేందుకు అర్హులు కాగా, సుమారు రూ.15 లక్షల విలువ చేసే వైద్యాన్ని ఈ కార్డు ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. పేద వారు ఆకస్మిక ఆరోగ్య సమస్యల బారిన పడినప్పుడు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఈ 'అమృత హస్తం' కార్డు రక్షణగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ శంకరయ్య మాట్లాడుతూ.. సమాజ సేవలో భాగంగానే ఈ వినూత్న హెల్త్ కార్డును ప్రవేశపెట్టామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 'వరంగల్ వాయిస్' ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి. బుద్ధ శంకరయ్య, జన్ను సదయ్య, చిట్టి జానకి రామ్ రెడ్డి, చిట్టి సతీష్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

- వేయిస్తంభాల గుడిలో ఉత్సవాల సందడి
- విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న రామప్ప, కాళేశ్వరం
- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు



అక్షరదర్బార్, హనుమకొండ : కాకతీయుల కళా వైభవానికి నిలయం, ఆధ్యాత్మిక క్షేత్రాల ఖిల్లా అయిన ఉమ్మడి వరంగల్ జిల్లా మహా శివరాత్రి వేడుకలకు సర్వసన్నద్ధమైంది. రేపు ఆదివారం పర్వదినం కావడంతో చారిత్రక శైవాలయాలన్నీ భక్తుల స్వాగతం కోసం ముస్తాబయ్యాయి. హనుమకొండలోని వేయి స్తంభాల గుడి నుండి ములుగులోని రామప్ప వరకు, జనగామలోని పాలకుర్తి నుండి భూపాలపల్లిలోని కాళేశ్వరం వరకు శైవ క్షేత్రాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ళు కూడా మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.

### - వేయి స్తంభాల గుడిలో 'కళ్యాణ' శోభ

హనుమకొండలోని చారిత్రక శ్రీ రుద్రేశ్వర స్వామి (వేయి స్తంభాల) దేవాలయంలో ఈ నెల 14 నుండి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పునర్నిర్మించిన కళ్యాణ మండపంలో స్వామివారి కళ్యాణోత్సవం కనుల పండువగా జరగనుంది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లలో చలువ పందిళ్లు, తాగునీరు, నిరంతర అన్నదాన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కలిగేలా వీఐపీ బ్రేక్ దర్శనాలను తగ్గించినట్లు అధికారులు వెల్లడించారు.

### విద్యుత్ వెలుగుల్లో రామప్ప

యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో రామలింగేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తనున్నారు. రాత్రివేళ విద్యుత్ దీపాల అలంకరణలో రామప్ప ఆలయం అత్యంత సుందరంగా కనిపిస్తోంది. హనుమకొండ నుండి రామప్పకు ప్రతి అర గంటకు ఒక ప్రత్యేక బస్సు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

### - ముస్తాబైన ప్రముఖ క్షేత్రాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మరిన్ని ఆలయాల్లో వేడుకలకు ఏర్పాట్లు జరిగాయి. భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి చెంత త్రివేణి సంగమ స్నానాలకు భక్తులు తరలివస్తున్నారు. ఇక్కడ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుండి కూడా భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉంది. కాజీపేట మండలం మడికొండలోని ఈ గుట్టపై ఉన్న ఆలయం విద్యుత్ కాంతులతో ముస్తాబైంది. మహబూబాబాద్ జిల్లా కురవిలో జరిగే జాతరకు భక్తులు తరలివస్తున్నారు. హనుమకొండ నగరం నడిబొడ్డున ఉన్న సిద్ధేశ్వరాలయం, ధర్మసాగర్ సమీపంలోని కైలాసగిరి గుట్టలపై శివరాత్రి జాగరణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీశైలం, వేములవాడ, రామప్ప, కాళేశ్వరం ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. రద్దీ ఎక్కువగా ఉండే ఆలయాల వద్ద తొక్కిసలాట జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# డీఎస్పీల బదిలీలకు రంగం సిద్ధం..?

- ఎమ్మెల్యేల చుట్టూ ఆశావాహుల ప్రదక్షిణలు
- రిటైర్మెంట్ కు దగ్గరవుతున్నా 'లూప్ లైన్' లోనే కొందరు సీనియర్లు
- లా అండ్ ఆర్డర్ పోస్టింగ్ కు డిమాండ్

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : రాష్ట్ర పోలీసు శాఖలో కీలకమైన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయి అధికారుల బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పరిపాలనా అవసరాలు, ఖాళీల భర్తీ, పనితీరు సమీక్షల ఆధారంగా ఈ బదిలీలు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో డీఎస్పీ స్థాయి పోస్టులు కోసం 1995- 96 డీఎస్పీలు లా అండ్ ఆర్డర్ పోస్టింగ్ ల కోసం ఎదురుచూస్తున్నారు. 95-96 బ్యాచ్ డీఎస్పీలు 2021లో ప్రమోషన్లు పొందారు. వీరిలో ఇప్పటివరకు లా అండ్ ఆర్డర్ పోస్ట్ చేయనివారు అధిక సంఖ్యలో ఉన్నారు ఇంటెలిజెన్స్. ఎస్ బీ, సీఐడీ, టీఎస్ ట్రాన్స్ కో తదితర పోస్టింగ్ లు చేస్తూ నెట్టుకొస్తున్నారు. లూప్ లైన్ విభాగాల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులను మార్పిడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నట్లు తెలుస్తోంది.

### - సిఫారసు లేఖలు

ముఖ్యంగా చట్టం- శాంతి, ట్రాఫిక్, క్రైమ్ విభాగాల్లో పునర్వ్యవస్థీకరణ చేపట్టే అవకాశం ఉందని సమాచారం. ఇటీవల జరిగిన పోలీసు ఉన్నత అధికారుల సమీక్ష సమావేశంలో జిల్లా వారీగా నివేదికలు సేకరించినట్లు తెలిసింది. పనితీరు, సీనియారిటీ, పరిపాలనా సమతుల్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని జాబితా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం, మరికొన్ని ప్రాంతాల్లో రాజకీయ నాయకుల సిఫారసు 'లేఖ' లకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టమవుతోంది. కొన్ని కీలక పట్టణాలు, కమిషనరేట్ల పరిధిలో మార్పులు చోటుచేసుకునే అవకాశమున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే ఎమ్మెల్యేల చుట్టు ఆశావాహులు పలు దఫాలుగా చక్కర్లు  కొడుతున్నారు.

### - లా అండ్ ఆర్డర్ కు డిమాండ్

అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉన్న డీఎస్పీలకు అవలీలగా పోస్టింగ్ లు లభిస్తుండగా పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేని డీఎస్పీల పరిస్థితి దారుణంగా తయారయింది. కేవలం ఎలాంటి ప్రాధాన్యత లేని పోస్టింగ్ లో విధులు నిర్వహిస్తూ రిటైర్మెంట్ కు చేరువలో ఉన్నారు పలువురు. వీరికి  లా అండ్ ఆర్డర్ పోస్టింగ్ అందని ద్రాక్ష లాగానే మిగిలిపోయేటట్లు కనిపిస్తోంది. లాండ్ ఆర్డర్ పోస్టింగ్ చేయకుండానే రిటైర్మెంట్ అయ్యే డీఎస్పీలు 95 బ్యాచ్ లో చాలామంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ రేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్ పోస్టింగ్ కోసం విపరీతమైన డిమాండ్ నెలకొంది అనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. రూ.30 నుంచి రూ.40 లక్షల వరకు ఏసీపీల పోస్టింగ్ ఉన్నట్లు వినికిడి. మున్సిపాలిటీ ఎన్నికల తర్వాత 50 నుంచి 60 మంది డీఎస్పీల బదిలీలు జరగనున్నట్లు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతుంది. ఈనెల రెండవ వారంలో డీఎస్పీల బదిలీలు జరగనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీకి మల్లేశం గౌడ్



అక్షరదర్బార్, పరకాల: సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సదస్సులో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన జిల్లా ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో హన్మకొండ జిల్లా పరకాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మల్లేశం గౌడ్ మాట్లాడుతూ, గీత వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న గీత కార్మికుల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కట్టుబడి ఉంటానన్నారు. తనను రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, హన్మకొండ జిల్లాకు చెందిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రంజిత్ గౌడ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వార్డు మెంబర్లకు శిక్షణ

### - ఎంపీడీవో సురేందర్ గౌడ్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ఇటీవల నూతనంగా ఎన్నికైన వార్డు మెంబర్లకు పంచాయతీ రాజ్ యాక్ట్ ప్రకారం ఈనెల 17 నుండి 21 తేదీ వరకు మొగుళ్ళపల్లి రైతు వేదిక ఆవరణలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మొగుళ్ళపల్లి ఎంపీడీవో సురేందర్ గౌడ్ విలేకరులకు తెలిపారు, ఈ అవకాశాన్ని నూతనంగా ఎంపికైన వార్డు మెంబర్లు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## విద్యార్థులు భయం వీడాలి



అక్షరదర్బార్, హనుమకొండ: విద్యార్థులు భయం లేకుండా పరీక్షలకు ప్రిపేర్ కావాలని ప్రముఖ సైకాలజిస్ట్ మోటివేషనల్ స్పీకర్, రిటైర్డ్ ఎంఈఓ  బిక్షపతి అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసికంగా ధైర్యంగా ఉండాలని, అలాంటప్పుడు పరీక్షలను అవలీలుగా రాయగలుగుతారని అయన అన్నారు. వడ్డేపల్లిలోని సాయి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ పిల్లల కోసం నడుపుతున్న సాయి స్పందన హైస్కూల్ లో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలలో విజయం సాధించడానికి పాటించవలసిన సూత్రాలు, పిల్లల్లో పరీక్షలంటే భయం పోగొట్టటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు మెలుకువలు తెలిపారు. ఈ కార్యక్రమం పిల్లలకు ఎంతో ఉపయోగ పడుతుందని స్కూల్ కరెస్పాండెంట్ మాదూరి శ్రీనివాసరావు, కార్యదర్శి లింగమూర్తి బిక్షపతికి కృతజ్ఞతలు తెలియజేశారు తెలియజేశారు. కార్యక్రమంలో టీచర్లు, స్టాఫ్ పాల్గొన్నారు.

## జవాన్లకు విద్యార్థుల నివాళులు

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం రోజున పుల్వామా దాడిలో మరణించిన అమర జవాన్లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ 2019లో పుల్వామా ఆత్మహుతి ఉగ్ర దాడిలో సుమారు 40 మంది సైనికులు మరణించారని, వారి మరణం ఈ దేశం మర్చిపోదని, వారి త్యాగం ఈ నెల మరువదని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కంచ రాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ, అంగన్వాడీ టీచర్ నందిపాటి సంధ్య, విద్యార్థులు ఆయాలు పాల్గొన్నారు.



# ఎర్రజెండా రెపరెపలు..

- మున్సిపల్ పీఠానికి కింగ్ మేకర్లుగా కమ్యూనిస్టులు!
- 6 స్థానాలను కైవసం చేసుకున్న వామపక్షాలు (సీపీఐ-3, సీపీఎం-3)
- ఉద్దండులను ఢీకొని గెలిచిన కామ్రేడ్లు
- చైర్మన్ పీఠం నిర్ణయించడంలో కీలకం కానున్న వామపక్షాల మద్దతు

అక్షర దర్బార్, మహబూబాబాద్ : ఒకప్పుడు వామపక్షాల కంచుకోటగా ఉన్న మహబూబాబాద్‌లో ఈ మున్సిపల్ ఎన్నికలు మళ్ళీ ఎర్రజెండాకు పూర్వవైభవం తెచ్చాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగినప్పటికీ, కమ్యూనిస్టు పార్టీలు సంయుక్తంగా 6 స్థానాలను గెలుచుకుని తమ పట్టును నిరూపించుకున్నాయి. సీపీఐ 3 స్థానాలు, సీపీఎం 3 స్థానాలు కైవసం చేసుకోవడం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

### సీపీఎం ఘనవిజయం:

**15వ వార్డు:** సీపీఎం అభ్యర్థి బానోతు బాబు 743 ఓట్లు సాధించి ఘనవిజయం సాధించారు.

**16వ వార్డు:** మహిళా అభ్యర్థిని పద్మ బానోతు 628 ఓట్లతో విజయం సాధించి మున్సిపాలిటీలో అడుగుపెట్టారు.

**29వ వార్డు:** సోమయ్య సుర్నపు 615 ఓట్లు సాధించి ప్రత్యర్థులను వెనక్కి నెట్టి సీపీఎం తరపున మూడో సీటును ఖాయం చేశారు.

### సీపీఐ ప్రభంజనం:

**18వ వార్డు:** రేషపల్లి నవీన్ 771 ఓట్ల సాధించి ప్రత్యర్థులపై విజయం సాధించారు.

**25వ వార్డు:** మహిళా నేత నర్రా సంధ్య 713 ఓట్లు సాధించి సీపీఐ జెండాను ఎగురవేశారు.

**33వ వార్డు:** బామనపల్లి అజయ్ సారధి విజేతగా నిలిచి మున్సిపల్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు.

### కింగ్ మేకర్లుగా వామపక్షాలు:

మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని నేపథ్యంలో, వామపక్షాల 6 ఓట్లు ఇప్పుడు అత్యంత కీలకంగా మారాయి. మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కాలనేది ఈ ఆరుగురు సభ్యుల నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. ప్రజల పక్షాన నిరంతరం పోరాడే కమ్యూనిస్టులకు ఓటర్లు మళ్ళీ ప్రాధాన్యతనిచ్చారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. వార్డుల్లో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారం కోసమే తమకు ఓటు వేశారని, ప్రజాస్వామ్య బద్ధంగా మున్సిపల్ పాలన సాగేలా తాము కృషి చేస్తామని గెలిచిన వామపక్ష సభ్యులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# సీసీటీవీ కెమెరాల ఏర్పాటు

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలోని యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో మిలాన్ గ్రూప్ సేవాభావంతో పాఠశాలలో ఉచితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి నెల ఒక ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసి ఉచితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ పాల్గొని సంస్థ ప్రతినిధులను అభినందించారు.




## మానుకోట మున్సిపాలిటీలో

# మహిళా ప్రభంజనం!

- రిజర్వ్‌డ్ స్థానాలే కాదు.. జనరల్ వార్డుల్లోనూ సత్తా చాటిన మహిళా నేతలు
- పార్టీల అండ లేకుండా స్వతంత్రులుగా గెలిచి రాజకీయ ఉద్దండులకు షాక్
- 1110 ఓట్లతో పద్మ బానోతు రికార్డు విన్



అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో మహిళా అభ్యర్థులు సరికొత్త చరిత్ర సృష్టించారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో మహిళలు రాజకీయ ఉద్దండులను ఢీకొని విజయకేతనం ఎగురవేశారు. కేవలం మహిళలకు కేటాయించిన వార్డులకే పరిమితం కాకుండా, జనరల్ వార్డుల్లోనూ పురుషులతో పోటీపడి విజయం సాధించడం విశేషం.

### రికార్డు స్థాయి మెజారిటీ:

ఈ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించిన అభ్యర్థిగా 10వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థిని పద్మ బానోతు నిలిచారు. ఆమె ఏకంగా 1110 ఓట్లు సాధించి ప్రత్యర్థులకు అందనంత దూరంలో నిలిచి రికార్డు సృష్టించారు.

### స్వతంత్ర మహిళా అభ్యర్థుల ప్రభంజనం:

పార్టీల గుర్తు లేకపోయినా, జనం తమకే మద్దతు ఇస్తారని మహిళా అభ్యర్థులు నిరూపించారు.

**3వ వార్డు:** స్వతంత్ర అభ్యర్థిని కోరివి రజిత 690 ఓట్లతో గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు.

**4వ వార్డు:** జ్యోతి గుగులోత్ 490 ఓట్లతో గెలిచి తన సత్తా చాటారు.

**30వ వార్డు:** గాడిపెల్లి లావణ్య 671 ఓట్లు సాధించి స్వతంత్ర అభ్యర్థిగా ఘన విజయం అందుకున్నారు.

### వార్డుల వారీగా విజేతలు:

మహబూబాబాద్ మున్సిపాలిటీలో మహిళా ప్రాతినిధ్యం ఏ స్థాయిలో ఉందో ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి:

**కాంగ్రెస్ (INC):** దూపాటి స్పందన (1వ వార్డు), హైమ నీరుటి (7వ వార్డు), బానోతు పార్వతి (8వ వార్డు), చిదిరాల అరుణ (19వ వార్డు) ఘనవిజయం సాధించారు.

**బీఆర్ఎస్ (BRS):** బొడ రమ్య (5వ వార్డు), భూక్యా బుజ్జి (6వ వార్డు), జరీనా బేగం (21వ వార్డు) తమ పట్టు నిలుపుకున్నారు.

**ఇతర పార్టీలు:** సీపీఎం నుండి పద్మ బానోతు (16వ వార్డు), సీపీఐ నుండి నర్రా సంధ్య (25వ వార్డు), బీజేపీ నుండి శ్రీదేవి మాలోతు (26వ వార్డు) గెలిచి తమ పార్టీల ఉనికిని చాటారు.

### మున్సిపల్ పీఠానికి కింగ్ మేకర్లుగా:

మహబూబాబాద్‌లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని నేపథ్యంలో, గెలిచిన మహిళా స్వతంత్ర అభ్యర్థులు ఇప్పుడు అత్యంత కీలకంగా మారారు. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని నిర్ణయించడంలో వీరి నిర్ణయం ప్రధాన భూమిక పోషించనుంది. పట్టణ అభివృద్ధిలో తమ గొంతుకను బలంగా వినిపిస్తామని గెలిచిన మహిళా నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫలితాలతో మహబూబాబాద్ రాజకీయాల్లో మహిళల పాత్ర మరింత బలోపేతమైంది. అభివృద్ధి పనుల పర్యవేక్షణలోనూ, సామాజిక సమస్యల పరిష్కారంలోనూ తమ మార్కు చూపిస్తామని విజేతలు స్పష్టం చేస్తున్నారు.

# 'నోటా'కే మా ఓటు!

- అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఓటర్లు
- మహబూబాబాద్ మున్సిపల్ పోరులో నోటాకు భారీగా ఓట్లు
- గెలుపోటములను శాసించిన 'పైవారెవరూ కాదు' ఆప్షన్
- ప్రధాన పార్టీల అభ్యర్థులపై ఓటర్ల నిశ్శబ్ద విప్లవం




అక్షర దర్బార్, మహబూబాబాద్ : మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అభ్యర్థుల జయాపజయాల కంటే 'నోటా' (None of the Above) సాధించిన ఓట్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. పోటీలో ఉన్న అభ్య ర్థులు ఎవరూ తమకు నచ్చలేదని, వారిలో ఎవ రికీ ఓటు వేసే ఉద్దేశం లేదని మహబూబాబాద్ ఓటర్లు స్పష్టం చేశారు. చాలా వార్డుల్లో గెలుపు ఓటముల మధ్య ఉన్న స్వల్ప తేడా కంటే నోటా కు పడిన ఓట్లు ఎక్కువగా ఉండటం విశేషం.

### వార్డుల వారీగా నోటా ప్రభావం:

మహబూబాబాద్ మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో దాదాపు అన్ని చోట్లా నోటా తన ఉనికిని చాటుకుంది. అత్యధికంగా 23వ వార్డులో ఏకంగా 19 మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు. ఇక్కడ పోటీ చేసిన అభ్యర్థుల ప్రచారం కంటే ఓటర్ల అసంతృప్తి బలంగా వినిపించింది.

### నిశ్శబ్ద విప్లవం:

రాజకీయ పార్టీలు టికెట్ల పంపిణీలో అనుసరించిన విధానాలు, అభ్యర్థుల ఎంపికపై ఉన్న అసంతృప్తిని ఓటర్లు ఈ రూపంలో వ్యక్తం చేశారు. ఓటు హక్కును వృథా చేయకుండా, తమ నిరసనను ప్రజాస్వామ్యబద్ధంగా తెలియజేయడానికి 'నోటా'ను ఒక అస్త్రంగా ఉపయోగించుకున్నారు.

### ఉత్కంఠ రేపిన ఫలితాలు:

**పలు వార్డుల్లో విజేతకు, సమీప ప్రత్యర్థికి మధ్య కేవలం 10 నుండి 20 ఓట్ల తేడా ఉండగా, అదే వార్డుల్లో 15 నుండి 20 వరకు నోటా ఓట్లు పడటం గమనార్హం. అంటే, నోటాకు పడిన ఓట్లు గనుక ఏదైనా అభ్యర్థికి పడి ఉంటే ఫలితాలు తారుమారై ఉండేవి.**

### రాజకీయ పార్టీలకు హెచ్చరిక:

పెరుగుతున్న నోటా ఓట్ల శాతం రాజకీయ పార్టీలకు ఒక హెచ్చరిక లాంటిదని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించని, కేవలం పార్టీ అండతో నెట్టుకొద్దామని చూసే అభ్యర్థులకు ఓటర్లు గుణపాఠం చెబుతున్నారని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి. భవిష్యత్తులో అభ్యర్థుల ఎంపికలో పార్టీలు మరింత జాగ్రత్త వహించాల్సిన అవసరాన్ని 'నోటా' గుర్తు చేస్తోంది. మొత్తానికి మహబూబాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో నోటా ఒక అదృశ్య శక్తిలా మారి అభ్యర్థుల మెజారిటీలను ప్రభావితం చేసింది. ప్రజాస్వామ్యంలో ఓటు వేయడమే కాదు, నచ్చని వారిని తిరస్కరించే హక్కు కూడా ఉందనే స్పృహ ఓటర్లలో పెరగడానికి ఇది నిదర్శనం.

# వికసించిన కమలం

- మహ-బాద్ మున్సిపాలిటీలో బీజేపీ ఖాతా ఓపెన్!
- 26వ వార్డులో శ్రీదేవి మాలోతు ఘనవిజయం
- జిల్లా కేంద్రంలో పార్టీ ఉనికిని చాటుకున్న అభ్యర్థిని
- కేడర్ లో కొత్త ఉత్సాహం..

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ (BJP) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తన ఉనికిని చాటుకుంది. హోరాహోరీగా సాగిన ఎన్నికల పోరులో 26వ వార్డు నుండి బీజేపీ అభ్యర్థిని శ్రీదేవి మాలోతు విజయం సాధించి, మున్సిపాలిటీలో పార్టీ తరపున తొలి ఖాతాను తెరిచారు.

### హోరాహోరీ పోరులో విజయం:

మొత్తం 36 వార్డుల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఉన్నప్పటికీ, 26వ వార్డులో మాత్రం బీజేపీ అభ్యర్థిని తనదైన ముద్ర వేశారు. శ్రీదేవి మాలోతు మొత్తం 472 ఓట్లు సాధించి ప్రత్యర్థులను వెనక్కి నెట్టారు. కౌంటింగ్ ప్రక్రియలో మొదటి నుండి ఆధిక్యాన్ని కనబరిచిన ఆమె, చివరకు విజేతగా నిలిచినట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించి ధృవీకరణ పత్రాన్ని అందజేశారు.

### పార్టీ శ్రేణుల్లో జోష్:

మహబూబాబాద్ పట్టణంలో బీజేపీ అభ్యర్థి గెలవడంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు సంబరాల్లో మునిగిపోయారు. జిల్లా కేంద్రంలో ఖాతా తెరవడం భవిష్యత్తు రాజకీయాలకు శుభసూచకమని వారు ఆనందం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ పట్టణంలో సందడి చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి ప్రధాన పార్టీల హవా కొనసాగిన ఈ ఎన్నికల్లో, బీజేపీ ఒక స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ముఖ్యంగా మహబూబాబాద్ మున్సిపాలిటీలో 'హంగ్' ఏర్పడే అవకాశం ఉండటంతో, ప్రతి ఒక్క ఓటు మరియు ప్రతి వార్డు మద్దతు ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో బీజేపీకి దక్కిన ఈ ఒక్క సీటు మున్సిపల్ రాజకీయాల్లో ఏ మేరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. వార్డు సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని విజేత శ్రీదేవి మాలోతు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# వ్యవసాయ అభివృద్ధిపై బ్యాంకుల ప్రత్యేక దృష్టి

- సెంట్రల్ బ్యాంకు ముంబై సెంట్రల్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి మురళీకృష్ణ,
- బ్యాంక్ నూతన భవనం ప్రారంభం
- వ్యవసాయ అభివృద్ధిపై బ్యాంకుల ప్రత్యేక దృష్టి

అక్షర దర్బార్, నర్సంపేట: రైతుల వ్యవసాయాభివృద్ధిపై సెంట్రల్ బ్యాంక్ ఆప్ ఇండియా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ముంబై సెంట్రల్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి. మురళీకృష్ణ తెలిపారు. నర్సంపేట అంగడి రోడ్డులో నూతన హంగులతో ఏర్పాటు చేసిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం రెడ్డి ఫంక్షన్ హాల్లో వ్యవసాయ రుణ వితరణ కార్యక్రమం నిర్వహించి, సెంట్ అగ్రిగోల్డ్ లోన్, సెంట్ ఫుడ్ ప్రొడక్షన్ ప్లస్ (రైస్ మిల్లు), సెంట్ జీఎస్టీ, తనఖా వ్యాపార రుణం తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రుణాలు సకాలంలో చెల్లిస్తూ ఆర్థికంగా ఎదగాలని, అలాగే ప్రధానమంత్రి కుసుమ యోజన ద్వారా సౌరశక్తిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ రీజనల్ కార్యాలయం అధికారులు సాంబయ్య,రాజారాం,శ్రీకాంత్, నర్సంపేట బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ తనుశ్రీ, సిబ్బంది ఉజ్మ, మౌనిక, సాదిక్, గోల్డ్ అప్రైజర్ వీరభద్రయ్యాచారి, పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.






# హంగ్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ ఫోకస్

- వ్యూహాత్మక అడుగులు.. ఆకర్ష్ మంత్రం
- కింగ్ మేకర్లుగా మారిన స్వతంత్రులు
- చైర్మన్ పీఠాలపై ఉత్కంఠ

అక్షరదర్బార్, వరంగల్ : మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ స్థానాలను గెలుచుకున్నప్పటికీ, సుమారు 33 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని 'హంగ్' పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ చైర్మన్ పీఠాన్ని అధిరోహించడానికి స్వతంత్రుల మద్దతు తప్పనిసరి అయ్యింది. జనగామ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 13, కాంగ్రెస్ 12 (మిత్రపక్షం సీపీఎంతో కలిపి 13) స్థానాలు గెలుచుకున్నాయి. నలుగురు స్వతంత్ర అభ్యర్థులు ఇక్కడ నిర్ణయాత్మక శక్తిగా మారారు. వీరిని చేర్చుకునేందుకు కాంగ్రెస్ నేతలు ఇప్పటికే రంగంలోకి దిగారు. మహబూబాబాద్, కేసముద్రం, వర్ధన్నపేట మున్సిపాలిటీల్లో కూడా హంగ్ ఏర్పడటంతో స్వతంత్రుల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య గట్టి పోటీ నెలకొంది.

## - ఆకర్ష్ మంత్రం

గెలిచిన స్వతంత్ర అభ్యర్థులను పార్టీలో చేర్చుకోవడం ద్వారా మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందుకోసం స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించారు. స్వతంత్రులకు తోడు, తమ పార్టీకి ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీల ఎక్స్-అఫిషియో ఓట్లను వినియోగించుకుని మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవాలని చూస్తోంది. మద్దతు ఇచ్చే స్వతంత్రులకు వైస్ చైర్మన్ పదవి లేదా ఇతర కమిటీల్లో ప్రాధాన్యత ఇస్తామనే హామీలు ఇస్తున్నట్లు సమాచారం.

## - ప్రతిపక్షాల ఆరోపణలు

కాంగ్రెస్ పార్టీ అధికార బలాన్ని ఉపయోగించి స్వతంత్రులను ప్రలోభాలకు గురిచేస్తోందని బీఆర్ఎస్, బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. హంగ్ ఏర్పడిన చోట రాజకీయ సమీకరణాలు గంటగంటకూ మారుతుండటంతో ఫిబ్రవరి 16న జరిగే చైర్మన్ ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది.



# సైబర్ 'వల'లో ఢిల్లీ బాధితులు

- నర్సంపేట మహిళ ఘనకార్యం
- నిరుద్యోగులు, అమాయకులే లక్ష్యంగా భారీ స్కామ్
- ఢిల్లీ పోలీసుల అదుపులో నిందితురాలు

అక్షరదర్బార్, నర్సంపేట : అమాయకత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే పల్లెటూరి నుంచి వెళ్లిన ఓ మహిళ, దేశ రాజధాని ఢిల్లీ వేదికగా సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌ను నడుపుతూ పోలీసులకు చిక్కిన ఉదంతం వరంగల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. నర్సంపేట నియోజకవర్గానికి చెందిన సదరు మహిళ, ఆధునిక సాంకేతికతను వాడుకుని సైబర్ వల విసిరి లక్షలాది రూపాయలు కాజేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీలో నివాసముంటున్న ఈ మహిళ, కొన్ని సైబర్ నేరగాళ్ల ముఠాలతో చేతులు కలిపింది. ప్రధానంగా నిరుద్యోగులకు ఉద్యోగ ఆశ చూపిస్తూ, లేదా అధిక లాభాలు వస్తాయంటూ సోషల్ మీడియా ద్వారా 'టాస్క్ బేస్డ్' మోసాలకు పాల్పడినట్లు సమాచారం. ఢిల్లీలోని పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన అక్కడి సైబర్ క్రైమ్ పోలీసులు, టెక్నాలజీ సాయంతో నిందితురాలిని ట్రాక్ చేశారు.బాధితులకు ఫోన్ కాల్స్, వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా గాలం వేయడం. సైబర్ నేరాల ద్వారా వచ్చే సొమ్మును దారి మళ్లించేందుకు వివిధ బ్యాంక్ ఖాతాలను ఈమె నిర్వహిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

## - నర్సంపేట లింకులు

ఈమె వెనుక జిల్లాకు చెందిన మరికొంతమంది ఉన్నారా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేటలోని ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు షాక్‌కు గురయ్యారు. బ్రతుకుదెరువు కోసం వెళ్ళిన మహిళ ఇలా సైబర్ దందాల్లో ఇరుక్కోవడంపై స్థానికంగా విస్మయం వ్యక్తమవుతోంది. ఢిల్లీ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

# మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయండి

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి :ములుగు పట్టణ కేంద్రంలోని నగరేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రోజున మహాశివరాత్రి ఉత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. నగరేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు సిరికొండ బలరాం మాట్లాడుతూ స్థానిక నగరేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శివపార్వతులకు ప్రత్యేక పూజలు మరియు అభిషేకములు జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా ఆలయ ప్రాంగణంలో జరుపబడున్నారు. జాగరణ చేసే భక్తులకు రాత్రి 10 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో హనుమకొండలోని తాండూరు రేణుక శిష్య బృందం చే కూచిపూడి, భరతనాట్యం, కళా ప్రదర్శన పేరణి శివతాండవం నిర్వహించబడును. పొన్నం రాణా ప్రతాప్ గారిచే బిగ్ బాక్సింగ్, బంజారా రమేష్ కళాబృందం చే మిమిక్రీ, ఆర్టిస్ట్ అనుకరణ, దామెర ప్రదీప్ సాగర్ ఆధ్వర్యంలో శివయ్య భక్తి గీతాల తోపాటు స్థానిక కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



# వైస్ చైర్మన్ రేసులో కొయ్యడ శ్రీనివాస్

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెల్లడైన అనంతరం పట్టణ రాజకీయాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై చర్చలు వేడెక్కాయి. 22 వార్డుల్లో 13 స్థానాలు గెలుచుకొని కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యం సాధించింది. మున్సిపల్ చైర్మన్ పదవికి బీసీ అభ్యర్థి పావుశెట్టి సునీల్ కుమార్ పేరు ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో వైస్ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందనే అంశంపై ఆసక్తి నెలకొంది. చైర్మన్ పదవి బీసీ వర్గానికి కేటాయించిన నేపథ్యంలో, కాంగ్రెస్ తరఫున గెలిచిన ఆరు స్థానాలు ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి అవకాశం కల్పించే అవకాశముందని చర్చ సాగుతోంది. ఈ క్రమంలో పార్టీకి మొదటి నుంచి సేవలందిస్తున్న కొయ్యడ శ్రీనివాస్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది.పా



ర్టీలో చురుకైన కార్యకర్తగా గుర్తింపు పొందిన కొయ్యడ శ్రీనివాస్‌కు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీర్వాదం లభిస్తే వైస్ చైర్మన్ పదవి దక్కే అవకాశముందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారికంగా పార్టీ ప్రకటించే వరకు ఈ అంశంపై స్పష్టత రాకుంది.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915